క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

తలకొండపల్లి: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ వెంకటేశయాదవ్ తెలిపిన వివరాలు.. మిడ్జిల్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పక్కా సమాచారంతో మండల పరిధిలోని వెల్జాల్‌లో శనివారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేశారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ తండాకు చెందిన అశోక్ (42) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. స్థానిక సర్పంచ్ జగ్గి.. కుమారుడు, బంజారా జిల్లా నాయకుడు రమేష్ నాయక్ బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. వ్యక్తిగతంగా రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, రవి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

తలకొండపల్లి: సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడా పోటీలను ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు తలకొండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నామని ఎంపీడీఓ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 36 సంవత్సరాలలోపు ఉన్న యువతీయువకులు ఈ క్రీడల్లో పాల్గొనుటకు అర్హులన్నారు. అథ్లెటిక్స్ 100 మీటర్లు, 400 మీటర్లు ఉంటుందని, ఖోఖో, వాలీబాల్ వంటి పోటీలను యువతి, యువకులకు వేరువేరుగా, ఫుట్‌బాల్ పోటీలను పురుషులకు మాత్రమే నిర్వహిస్తారని తెలిపారు.

17 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రతిభా నగర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 15 నుంచి 17 వరకు శ్రీ శివలింగ, నందీశ్వర, ఎల్లమ్మదేవత, మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు జెల్లెల లలిత, జంగయ్యయాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు శ్రీశైలానికి చెందిన శ్రీ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి

తలకొండపల్లి: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ టీపీసీసీ కిసాన్‌సెల్ పిలుపు మేరకు ఈ నెల 15న అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తడిసిన ధాన్యం కొనుగోలు, తరుగు పేరిట 10 కిలోల వరకు దోపిడీ, మొక్కజొన్న కేంద్రాల ఏర్పాటు తదితర డిమాండ్లతో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. తూకం వేయగానే రైతులకు ట్రాక్‌షీట్ ఇవ్వాలని, మిల్లర్లతో రైతులకు ఎలాంటి సంబంధం లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు విష్ణుగౌడ్ పాల్గొన్నారు.

నెరవేరనున్న నిరుపేదల కల

- త్వరలో డబుల్ ఇళ్ల పట్టాల పంపిణీ
- లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- కలెక్టర్‌కు నివేదిక పంపిన అధికారులు



లింగంపల్లి గేట్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మంచాల: నాలుగున్నర సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాల పంపిణీ త్వరలో పూర్తికానుంది. ఇప్పటికే లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేశారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచాల మండలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం నోముల రెవెన్యూ పరిధిలోని లింగంపల్లి గేట్ వద్ద నాలుగున్నర సంవత్సరాల క్రితం 100, 101 సర్వే నంబర్లలో 2.00 ఎకరాల స్థలం గుర్తించారు. అందులో ఇప్పటికే 96 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. అప్పట్లో ఇళ్లులేని నిరుపేదలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీంతో నోముల గ్రామంలో 85, మంచాల గ్రామంలో 276, లింగంపల్లి గ్రామంలో 96 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా మొత్తంగా 460 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

లాటరీ పద్ధతిలో ఎంపిక..

ఇళ్లు నిర్మాణం చేసి ఏడాదిన్నర దాటినా లబ్ధిదారుల ఎంపిక అధికారులకు సమస్యగా మారింది. చివరికి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అధికారులు నిర్ణయించారు. గ్రామాలవారీగా దరఖాస్తు చేసుకున్న వారిలో ఆర్థిక స్థితిగతులు, గతంలో ఇళ్లు వచ్చాయా అనే కోణంలో విచారణ చేసి జాబితాను తయారుచేశారు. గ్రామసభల ద్వారా లాటరీలు తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. 96 ఇళ్లల్లో నోముల 30, లింగంపల్లి 30, మంచాల 30 ఇళ్లు ఇవ్వగా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన 5 మందికి 5 ఇళ్లు ఇచ్చారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతకు ఒక ఇల్లు కేటాయించారు. మంచాల మండలంలో 96 డబుల్ బెడ్‌రూం ఇళ్లు ప్రశాంతంగా..గొడవలు లేకుండా ఎంపిక పూర్తిచేశారు.ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసి కలెక్టర్ ఆదేశానుసారంగా త్వరలోనే ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నారు. అయితే గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపికచేయడంతో ఆశపడ్డ వారికి నిరాశే మిగిలింది. లాటరీ పద్ధతి ద్వారా తమకు న్యాయం జరగలేదని చాలమంది నిరుపేదలు నిరాశలో ఉన్నారు.

ఎమ్మెల్యే మంచిరెడ్డి కృషి ఫలితమే



మంచాల మండలంలోని నోముల, లింగంపల్లి, మంచాల గ్రామాల్లో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు వస్తున్నాయంటే అది స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషి ఫలితమే. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– రవి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, నోముల

త్వరలో పట్టాల పంపిణీ



లాటరీ పద్ధతిలో పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాం.మండల పరిధిలోని'డబుల్' లబ్ధిదారుల వివరాలు కలెక్టర్‌కు నివేదిక రూపంలో పంపించాం. వారి ఆదేశానుసారం త్వరలో పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తాం.

– అనిత, తహసీల్దార్, మంచాల

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: కార్యకర్తలు, వారి కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చెప్పారు. మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వెంకటయ్య ఇటీవల మృతిచెందాడు. వెంకటయ్య బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండటంతో బీమా కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం జరిగిన మృతుడు వెంకటయ్య కుమారుడు యాదగిరికి రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ఆపత్కాలంలో కార్యకర్తలకు అండగా ఉండటానికి సభ్యత్వం తీసుకున్న ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు బీమా చేశారని చెప్పారు. రాష్ట్రంలోని 60 లక్షలమంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు బీమా సదుపాయం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య, సుధీర్, రామస్వామి, భూపతిరెడ్డి, జంగయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన అలివేలుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.32 వేలు చెక్కును ఎమ్మెల్యే అందించారు.

'ఫాక్స్‌కాన్' ప్రారంభోత్సవానికి తరలిరండి



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్

మంచాల: ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రారంభోత్సవం సోమవారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా నిర్వహించడం జరుగుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. శనివారం మంచాలలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ సభకు ప్రతి గ్రామం నుంచి 50 మందికి తగ్గకుండా కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేస్తున్న కృషికి నిదర్శనమే ఫ్యాక్స్‌కాన్ కంపెనీ అన్నారు. అనేక పరిశ్రమలను తీసుకొనివచ్చి నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీయస్ చైర్మన్ పుల్లారెడ్డి, వైస్‌చైర్మన్ యాదయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, నాయకులు రవి, జంగారెడ్డి, జ్ఞానేశ్వర్, రఘుపతి పాల్గొన్నారు.

ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ఉంటాం

సర్పంచ్ గోదాదేవి



నూతన వధువుకు పెళ్లికానుక అందిస్తున్న గోదాదేవి, సత్యం

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామంలో ఆడబిడ్డల పెళ్లికి అండగా ఉంటామని ఆ గ్రామ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, మండల బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో వధువు సంధ్యారాణి వివాహం సందర్భంగా శనివారం ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు రూ.10116 నగదు, చీర అందించారు. ఈసందర్భంగా గోదాదేవి మాట్లాడుతూ.. శెట్టిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఆడబిడ్డల వివాహం సందర్భంగా రూ.10116 పెళ్లికానుకగా అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 62 మంది అమ్మాయిలకు పెళ్లి కానుక అందించినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటయ్య, యాదయ్య, జంగయ్య, బాలయ్య, ఎల్లయ్య, జగన్, శ్రీకాంత్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



వీఓఏలకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: వీఓఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మెకు శనివారం డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్ , రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ సంఘీభావం తెలిపారు. వీఓఏలు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని పనికి తగిన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. హక్కుల కోసం గొంతెత్తుతుంటే ఈ ప్రభుత్వం అణిచివేసే ధోరణి అవలంభిస్తోందన్నారు. ఉద్యమాలను నుంచి పుట్టిన పార్టీయే ఉద్యమకారులను, ప్రశ్నించే వారిని అణిచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వీఏఓలను పర్మినెంట్ చేయడంతో పాటు వారి వేతనాలను రూ.26వేలకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్, పాండునాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు యాదయ్యగౌడ్, సత్యంయాదవ్, రాజేశ్, ఇమ్రాన్, చంద్రశేఖర్, రవి, యాదయ్య, శ్రీకాంత్, విజయ్, భానుకిరణ్, సత్యం యాదవ్, రాజేందర్, బాలరాజు, వీఏఓలు తదితరులు ఉన్నారు.

మైనారిటీ కాలేజీలో క్రీడాపోటీలు

ఇబ్రహీంపట్నం: సోమవారం నుంచి ప్రారంభంకానున్న సీఎం కప్–2023 ఇబ్రహీంపట్నం మండల స్థాయి క్రీడా పోటీలను చర్లపటేల్‌గూడలోని మైనారిటీ రెసిడెన్షియల్ కాలేజీలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలను సోమ, మంగళ, బుధవారల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు.

సోనిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే



సోని చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నేతలు, జేపీఎస్‌లు

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్

ఇబ్రహీంపట్నం: జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోనిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని ఇబ్రహీంపట్నం బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేష్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం సోని ఆత్మకు శాంతి చేకూరాలని బీఎస్పీ నేతలు ర్యాలీ నిర్వహించారు. సమ్మె చేస్తున్న జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల శిబిరం వద్దకు వెళ్లి సోని చిత్రపటానికి నివాళి అర్పించారు. జేపీఎస్, ఓపీఎస్‌లకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటామన్నారు. ఆ పార్టీ నాయకులు గణేశ్, ప్రహ్లాద, శాంత, మహేందర్, కళ్యాణ్, కృష్ణ పాల్గొన్నారు.



'శిశుమందిర్'కు క్రీడావస్తువుల బహూకరణ



క్రీడా సామగ్రిని ప్రారంభిస్తున్న దాత రాము

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు స్థానిక పట్టణానికి చెందిన నల్లబోలు రాము క్రీడాసామాగ్రి, వస్తువులను అందజేశారు. పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో క్రీడాసామగ్రిని ఆయన అందజేశారు. శిశుమందిర్ పాఠశాలకు అవసరమైన క్రీడాసామగ్రితో పాటు వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఎలాంటి అవసరమున్నా తమను సంప్రదించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిశుమందిర్‌పాఠశాల అధ్యక్షుడు రాము, పాఠశాల కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఆనంద్, అంజయ్య, నారాయణ, కవిత, స్వాతి, జంగయ్య, నిరంజన్, మురహరి, నర్సింహ, శ్రీను, రాఘవేందర్, కుమార, ప్రభాకర్, రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కాంగ్రెస్‌దే

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభీ మోగించింది. ఈ సదర్భంగా ఆ పార్టీ విజయం రానున్న తెలంగాణ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలపై శనివారం మన ప్రాంత కాంగ్రెస్ నేతలతో సాక్షి ముచ్చటించింది.. వారి మాటలు మీకోసం..

బీజేపీకి తగిన గుణపాఠం



రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కర్ణాటక ఫలితాలే పునరావృత్తం అవుతాయి. గత కర్ణాటక ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. ఈ ఎన్నికలతో కన్నడ ప్రజలు బీజేపీ తగిన గుణపాఠం చెప్పారు. తెలంగాణలో కూడా బీఆర్ఎస్ పార్టీకి చరమగీతం పాడే రోజులు దగ్గర్లో ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం.

– ఆర్తిక గౌడ్, ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్

నేతల్లో జోష్ పెంచింది



కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలుపు తెలంగాణలోని పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచింది. కర్ణాటకలో బీజేపీ నేతలు అవినీతిలో కూరుకుపోయారని వారికి కన్నడ ప్రజలు తగిన తీర్పునిచ్చారు. ఇదే జోష్‌తో తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు.

– కోదండరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత

మేనిఫెస్టోనే గెలిపించింది

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కన్నడ ప్రజలు చారిత్రక తీర్పునిచ్చారు. పార్టీ మేనిఫెస్టోను చూసే మెజార్టీ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారు. ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.3వేల నిరుద్యోగ భృతి, 10 కిలోల ఉచిత బియ్యం వంటి హామీలు గెలిపించాయి. ఇదే స్ఫూర్తితో తెలంగాణలో అధికారంలోకి వస్తాం.

– అజీం, కల్వకుర్తి సోషల్ మీడియా కన్వీనర్

కళాకారులను ఆదరిద్దాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



కళాకారులను సన్మానిస్తున్న వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: కనుమరుగవుతున్న కళలను ఆదరించాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంతారంలో శనివారం చెన్నకేశవస్వామి స్టేజి నాటకన్ని కళాకారులు ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్టేజి నాటకాలను నిర్వహించడం అభినందనీయమని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులువరప్రసాద్‌రెడ్డి తెలిపారు. నాటకం అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాకారులకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, మాజీ సర్పంచ్ భవానీ, జంగయ్య, మహేశ్, మల్లేష్, రాములు, రవి, ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

యాచారం: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ... రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో తూకాల్లో మోసం చేయరాదని, కొన్ని కేంద్రాల్లో తరుగు పేరుతో బస్తాకు 5 కిలోల ధాన్యాన్ని తీస్తున్నారని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

పరస్పర అవగాహనతో అభివృద్ధి: చైర్మన్

పహాడీషరీఫ్: బీఆర్ఎస్, మజ్లిస్ పరస్పర అవగాహనతో జల్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి సాధ్యమవుతుందని జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది తెలిపారు. ఎర్రకుంటలోని వార్డు–27లో రూ.37.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన స్థానిక బీఆర్ఎస్ కౌన్సిలర్ నూరా ఎక్బాల్ ఖలీఫాతో కలిసి ప్రారంభించారు. మున్సి పాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు. మంత్రి సబితారెడ్డి ఎప్పటికప్పుడు చొరవ తీసుకుంటూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయడం హర్షణీయమన్నారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల శనివారం ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. పార్టీ కార్యాలయాల వద్ద బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణతో పాటు దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని నేతలు దీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్, కేంద్రలోని బీజేపీ పాలనను ప్రజలు తిప్పికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: మిఠాయిలు తినిపిస్తున్న మధుసూదన్‌రెడ్డి



కడ్తాల్: బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ శ్రేణులు



తలకొండపల్లి: టపాసులు కాలుస్తూ..



ఇబ్రహీంపట్నం: టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



తుర్కయంజాల్: సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు



మంచాల: బాణాసంచా కాలుస్తున్న నాయకులు



ఆమనగల్లు: స్వీట్లు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు